ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# పల్నాడు జిల్లా వార్తలు

3

ఆదివారం 5 జనవరి 2025





# రోడ్డెక్కనున్న షీ-ఆటోలు

- పీఎం అజయ్‌తో మహిళలకు ఉపాధి
- పది మండలాల నుంచి 28 మంది ఎంపిక
- ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధిపై డీఆర్‌డీఏ దృష్టి
- గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా కార్యక్రమం
- రూ.3 లక్షలు వడ్డీలేని రుణం.. రూ.50 వేలు సబ్సిడీ

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా.. ఆర్థికంగా శక్తివంతులను చేయడమే ధ్యేయంగా.. జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రవాణా రంగంలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు నూతన ప్రణాళికల అమలుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి ఇచ్చేందుకు డీఆర్‌డీఏ షీ-ఆటోలను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో ప్రయోగాత్మకంగా గుంటూరు జిల్లాలో షీ-ఆటోలను ప్రవేశపెట్టేందుకు డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం అనుకున్న లక్ష్యాలను సాధిస్తే మిగిలిన జిల్లాల్లో కూడా షీ-ఆటోలను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు డీఆర్‌డీఏ తరపున బ్యాంకులతో మాట్లాడి రుణాలు మంజూరు చేయిస్తారు. ఒక్కొక్క మహిళకు రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తారు. అందులో రూ.50 వేల వరకు సబ్సిడీ కింద మినహాయింపు ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు నెలవారీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద సుమారు 82 మంది మహిళలకు ఆటోలు ఇప్పించేందుకు డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేసింది. ఇందులో మొదట విడతగా 28 మంది మహిళలను ఎంపిక చేశారు. అందులో పది మండలాలకు ప్రాధాన్యం ఇచ్చారు. చేబ్రోలు-3, దుగ్గిరాల-2, గుంటూరు-7, కొల్లిపర-1, మేడికొండూరు-2, పెదనందిపాడు-6, ఫిరంగిపురం-2, తెనాలి-1, తుళ్లూరు-1, వట్టిచెరుకూరు-3 చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు.

### డ్రైవింగ్ నైపుణ్యం కలిగిన వారే ఎంపిక..

గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన షీ-ఆటో లబ్ధిదారుల ఎంపికలో డీఆర్‌డీఏ అధికారులు ప్రధానంగా చదువుతో పాటు డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఆటో తీసుకుని పూర్తిగా దానిపై ఆధారపడి ఆర్థికాభివృద్ధి సాధిస్తామన్న భరోసా, నమ్మకం కలిగిన వారిని మాత్రమే మొదటి విడతలో ప్రాధాన్యం ఇచ్చారు. లబ్ధిదారులు ఎంచుకున్న రవాణా రంగం వారికెంత మేరకు ప్రయోజనకరంగా ఉంటుందన్న విషయాన్ని కూడా ఆయా గ్రామాలకు వెళ్లిన డీఆర్‌డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఆటోలకు స్థానికంగా ఉన్న అవసరాలను కూడా అంచనా వేశారు.

### స్థితిగతుల్లో మార్పు...



మహిళలు తలుచుకుంటే చేయలేని పనిలేదు. రవాణా రంగంలో వారి ప్రాధాన్యం పెంచడం సంతోషం. పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా ఇప్పించే ఆటోలు వారి జీవన స్థితిగతులను సంపూర్ణంగా మార్చుతాయి. వారి ఆర్థికాభివృద్ధి ఆటోలా పరుగులు పెడుతుంది. మూస పోసిన పద్ధతిలో కాకుండా వినూత్నంగా ఆలోచించే ఎస్సీ మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తరపున అన్ని విధాలా అండగా ఉంటాం.

-టీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ, గుంటూరు

ఇంటిని కోల్పోయాం.. పరిహారం అందించండి
- పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ
- 53వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

4

సాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కేంద్రీయ జలశక్తి సభ్యులు

డీఆర్ఎం విధుల్లో చేరడంపై అనిశ్చితి

6

- తొలుత ఆనంద్ మధుకర్ నియామకం
- ఆయన ఆసక్తి కనబరచకపోవడంతో లిలీ పాండేయకు పోస్టింగ్

- రూ.70 కోట్ల మంజూరులో అవకతవకలు
- నకిలీ పాసు పుస్తకాలతో దారిమళ్లించినట్లు ఆరోపణ
- బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి ప్లెడ్జి రుణాలు
- నల్లపాడు జీడీసీసీ బ్యాంకు అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- 17 కోల్డ్‌స్టోరేజ్‌లకు జారీ చేసిన లోన్లను పరిశీలించాలని ఆదేశాలు



# రుణాలు గోల్‌మాల్

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అనే వ్యక్తి పేరుతో గుంటూరు సమీపంలోని నల్లపాడు జీడీసీసీ బ్రాంచ్‌లో రూ.10 లక్షలు రుణం ఇచ్చినట్లు రికార్డులో ఉంది. ఆ రుణం సంగతి తనకు తెలియదని బాధితుడు చెప్తున్నాడు. దీంతో నల్లపాడు బ్రాంచ్‌లో 2022-23 మధ్య కాలంలో జరిగిన అక్రమ రుణ మేళా వెలుగు చూసింది. ఒకే కోల్డ్ స్టోరేజ్‌కి సుమారు రూ.53 కోట్ల వరకు రుణాలు ఇవ్వడం, అక్కడ సరైన మిర్చి నిల్వలు లేకపోవడం వంటి వాటిని అప్పట్లో విచారణకు వెళ్లిన అధికారులు గుర్తించారు. ఈ మేరకు నల్లపాడు జీడీసీసీ అక్రమాలపై ప్రాథమిక విచారణ నిర్వహించిన జిల్లా సహకార అధికారి వీరాచారి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో మరింత లోతైన విచారణ జరిపించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సహకార కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో తెనాలి డివిజనల్ సహకార అధికారి కేవీ రామారావును విచారణ అధికారిగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

### ప్రారంభమైన విచారణ..

ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో నల్లపాడు జీడీసీసీ(గుంటూరు జిల్లా కేంద్ర సహకార) బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. బ్యాంకుకు సంబంధించిన సమాచారం, విచారణకు అవసరమైన రికార్డులను సహకార శాఖ అధికారులు కేవీ రామారావుకు అందజేశారు. బ్యాంకు పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు మంజూరు చేసిన రుణాలు భారీస్థాయిలో పక్కదారి పట్టిన నేపథ్యంలో ఈ విచారణ జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో జీడీసీసీలో కీలకపాత్ర పోషించిన వ్యక్తులు నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి రుణాలను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు పరిధిలో సుమారు రూ.70 కోట్ల వరకు ప్లెడ్జి రుణాల కింద మంజూరు కాగా చాలా వరకు బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలున్నాయి. వినుకొండ ప్రాంతంలో క్యాటరింగ్ చేసుకునే వ్యక్తులకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు అక్రమార్కులైన నేతలకు సహాయ పడ్డారన్న విమర్శలున్నాయి.

### అన్నింటిపై విచారణ..

నల్లపాడు బ్రాంచి పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్ లకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. వాటిపై కూడా విచారణ జరగనుంది. ప్లెడ్జి రుణాలతో పాటు, మిగిలిన రుణాలపై కూడా దర్యాప్తు చేపట్టనున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో జరిగిన మొత్తం లావాదేవీలు, రుణాలు పంపిణీ, రికవరీ తదితరాలపై విచారణ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది.

### అన్ని చోట్ల అదే పరిస్థితి

కోల్డ్‌స్టోరేజ్‌ల పేరుతో జీడీసీసీలో భారీగా ప్లెడ్జి రుణాలు పొందారు. వాస్తవానికి అక్కడ ఏ విధమైన మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు ఇచ్చేశారు. కొన్ని సందర్భాల్లో రుణం ఇచ్చేటప్పుడు మిర్చి ఉన్నట్లుగా చూపించినా ఆ తర్వాత దానిని వేరే వ్యక్తులకు అమ్మేశారు. ఇటువంటి వ్యవహారంలో కొందరు అధికారులు పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. చాలా సందర్భాల్లో అసలు రైతుకు తెలియకుండానే రుణం ఇచ్చేశారని సమాచారం. ఇలా అక్రమాలు పెద్దఎత్తున జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక వెళ్ళింది. ఇవికాక ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రుణాల పేరుతో బ్యాంకు నిధులను దారిమళ్లించారని తెలిసింది. ఇతర రుణాల్లోనూ అక్రమాలు జరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ప్రభావతిపై.. ఎవరి ప్రభావం?

- రఘురామ కేసులో వెలుగుచూసిన కొత్త కోణం
- ఐఏఎస్ శ్రీలక్ష్మి తరహాలో ఊబిలో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్
- గత ప్రభుత్వంలో ఓ ఎంపీ అండతోనే ఆమెకు కీలక పోస్టింగ్
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ఆ ఎంపీని వెంటాడుతున్న గతం

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుని హత్య చేసేందుకు పన్నిన కుట్ర కేసులో నిందితురాలిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ప్రభావతి ఉదంతంలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ప్రభావతి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితురాలు కావడంలో కీలకపాత్ర పోషించిన నాటి వైసీపీ ఎంపీ, ఇప్పటి కూటమి ఎంపీపై కొత్త చర్చకు తెరలేచింది. రఘురామకృష్ణరాజును హింసించాలన్న ఆలోచన నాటి ముఖ్యమంత్రి జగన్‌ది కాగా అందుకు ఆయన చుట్టూ ఉన్న నేతలు సహాయ పడ్డారన్న ఆరోపణలున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రభావతిని కూడా అప్పట్లో కీలకంగా ఉన్న ఎంపీ ప్రభావితం చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రభావతి భర్త రవికి సదరు ఎంపీకి మధ్య మంచి స్నేహం ఉండడంతో తగిన అర్హతలు లేనప్పటికీ ఆమెను జీజీహెచ్‌లో అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. ఆమెను సూపరింటెండెంట్‌ను చేసేందుకు అర్హతలు ఉన్న నిపుణులైన డాక్టర్లను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఈ కృతజ్ఞతతోనే ప్రభావతి, రఘురామకృష్ణరాజు కేసులో తీవ్రమైన అన్యాయానికి ఒడిగట్టినట్లు ప్రచారం జరుగుతోంది. 2020లో ఆమె జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించి 2023లో ఉద్యోగ విరమణ పొందారు. ఆ మధ్య కాలంలోనే రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ ఉదంతం జరిగింది.

### ఎంపీ అండతో చెలరేగిన వైనం..

జగన్‌కు అప్పట్లో సన్నిహితంగా ఉండే ఎంపీ అండదండలు ఉన్నాయన్న ఆలోచనతో ప్రభావతి చాలా సందర్భాల్లో ఇతర పార్టీల నేతలను పూచికపుల్లతో సమానంగా చూశారన్న ఆరోపణలున్నాయి. రఘురామ దేహంపై తీవ్రమైన గాయాలు ఉన్నా ఏమి కాలేదని నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఆమె మాత్రమే కాకుండా గుండె వైద్య నిపుణులపై కూడా నివేదిక మార్చేలా ఒత్తిడి తెచ్చినట్లు తేలింది. చెప్పినట్లు చేయకపోతే బాగుండదు.. ప్రభుత్వ పెద్దల నుంచి ఇబ్బందులు వస్తాయని ప్రభావతి తోటి వైద్యులతో అన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇదే వ్యవహారంలో రఘురామకృష్ణరాజు లాయర్ పోసాని వెంకటేశ్వర్లు చేసిన వాదనలు కూడా వారు గుర్తు చేస్తున్నారు. సీఐడీ కస్టడీలో ఉన్న రఘురామ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య నివేదిక ఇవ్వాలని కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ప్రభావతి ఒత్తిడి తీసుకురావడంలో ఎంపీ పాత్రే కీలకమైనదనే వాదన తెరపైకి వచ్చింది.

### మరో శ్రీలక్ష్మి..

రాజకీయ నాయకుల అండదండలతో కీలకమైన పోస్టులోకి వస్తున్న అధికారులు ఎక్కడో ఒక చోట ఇరుక్కుంటూనే ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి అదే రీతిలో కేసుల్లో ఇరుక్కోగా ఇప్పుడు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తప్పులో కాలేశారు. ఉద్యోగ విరమణ పొంది ప్రశాంతంగా జీవిస్తున్న సమయంలో ఆమె చుట్టూ ఉచ్చు బిగిసింది.

### నివేదిక తప్పుల తడక..

ప్రభావతి నేతృత్వంలో మాజీ ఎంపీ వ్యవహారంలో ఇచ్చిన రిపోర్టు పూర్తి స్థాయిలో తప్పుల తడకతో కూడిందని నిర్ధారణైంది. పోలీసులు కొట్టిన దెబ్బలకు నరాలు చిట్లి అంతర్గతంగా రక్తస్రావం జరిగినట్లు కూడా గుర్తించారని రఘురామ లాయర్ కోర్టుకు వివరించారు. రఘురామను కస్టడీలో చిత్రహింసలకు గురిచేసినట్లు సుప్రీంకోర్టు సైతం ప్రాథమికంగా నిర్ధారించిందంటే ప్రభావతి బృందం ఎంత ధైర్యంతో వాస్తవ నివేదికను తారుమారు చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన మునివేళ్లకు గాయాలు ఉన్నట్లు విజయవాడలోని మెడికల్ బోర్డు నిర్ధారిస్తే ప్రభావతికి అవేవీ కనిపించలేదు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన సీఐడీ అధికారులను కాపాడేందుకు ప్రభావతి శతవిధాలా ప్రయత్నించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

# నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

### విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి). నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర శక్తులను గుర్తించి, వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకత బహిర్గతమవుతుందన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులు సమకాలిన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తొలుత సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్యే అరవిందబాబు ప్రారంభించారు. మూడు విభాగాల్లో ప్రదర్శన జరగ్గా ఉపాధ్యాయ విభాగంలో 14, విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో 27, బృంద విభాగంలో 25 ప్రదర్శనలతో పాటు పుస్తక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విజేతలకు బహుమతులు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తదితరులు

### విజేతలకు బహుమతులు..

విజేతలకు జేసీ సూరజ్‌గనోరేతో కలసి కలెక్టర్ బహుమతులు అందజేశారు. క్విజ్‌లో పసుమర్రు జడ్పీహెచ్, బ్రాహ్మణపల్లి జడ్పీహెచ్, గణపవరం జడ్పీహెచ్ విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వ్యక్తిగత ప్రదర్శనలో విజయపురిసౌత్ పాఠశాలకు చెందిన పీవీ నాగార్జున మొదటి, దాచేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పీ దిలీప్ ద్వితీయ బహుమతి సాధించారు. గ్రూప్ ప్రదర్శనలో వీరెడ్డిపాలెం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కే బాలాజీ, విజయభాస్కరరెడ్డిలు మొదటి, అడిగొప్పల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కే రవిశంకర్, డీ విష్ణువర్ధన్‌లు ద్వితీయ బహుమతి సాధించారు. ఉపాధ్యాయ విభాగంలో వై మణికంఠ(దొడ్లేరు జడ్పీహెచ్‌ఎస్) ప్రథమ, ఎస్ఎంఎల్ కాత్యాయిని(గణపవరం జడ్పీహెచ్‌ఎస్) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి యేసుబాబు, నరసరావుపేట ఎంఈవో నాగేశ్వరరావు, డీఎస్‌వో రాజశేఖర్, హెచ్ఎంలు గోవిందరాజులు, రసూల్, ప్రసాద్, యర్రం హనుమంతరావు, రవికాంత్, వెంకట్రావు, నగేష్, వీరప్పయ్య, విశ్రాంత డీఎస్‌వో మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రాపవుట్స్ తగ్గించేందుకే మధ్యాహ్న భోజనం

- ఇంటర్ విద్య బలోపేతానికి డొక్కా సీతమ్మ పేరిట పథకం
- సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు

సత్తెనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల డ్రాపవుట్స్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం భోజన పథకాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంలో అందించే పదార్థాలను వృథా చేయకూడదని సూచించారు. జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1700 మందికి పైగా విద్యార్థులకు లబ్ధి జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఇతర అధికారులు భోజనం చేశారు. కళాశాలకు వంద భోజనం ప్లేట్లను అందించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావును కలెక్టర్ అభినందించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కస్టమర్ కేర్ విభాగంలో శిక్షణ పొందిన విద్యా ర్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందించారు.



సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

### అన్ని కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి నీలావతి దేవి తెలిపారు. ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ పథకం వరంలాంటిదన్నారు. ఈ పథకంతో కళాశాలల్లో హాజరు శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ షమ్మి, తహసీల్దార్ చక్రవర్తి, డీఈవో చంద్రకళ, ప్రిన్సిపాల్ పద్మావతి, టీడీపీ నాయకులు ఎలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించండి

● మంత్రి అనగాని సత్యప్రసాద్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల టీడీపీ కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టభద్రులు, వైద్యులు, న్యాయవాదులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పాఠశాలల యాజమాన్యంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రౌడీలకు ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టి ఆ పదవికే కళంకం తెచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా చదువుకునే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగస్తులను అన్ని విధాలా వేధించింది జగన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. ఆయన హయాంలో ఉన్న ఎమ్మెల్సీలు రౌడీమూకలేనని, అనంతబాబును హత్యచేసి కారులో శవాన్ని డోర్ డెలివరీ చేసినా జగన్‌రెడ్డి కనీసం స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంత అభివృద్ధి కోసం తనవంతు కృషి చేశానని, వేమూరు, తెనాలి శాసనసభ్యునిగా, విద్యాశాఖ మంత్రిగా పని చేశానని, ఉద్యోగస్తుల కష్టనష్టాలు తనకుతెలుసునన్నారు. వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు డైరెక్టర్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు మణిక్యారావు, కొల్లూరు ఎంపీపీ కనగాల మధుసూదన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్వాన్ గోగినేని కనకయ్య సేవలు మరువలేనివి



కనకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్వాన్ గోగినేని కనకయ్య విద్యారంగానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గోగినేని కనకయ్య 108 జయంతి వేడుకలను స్థానిక ఎస్‌వీవీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక విద్యా సంస్థలను నెలకొల్పిన విద్యా ప్రదాత గోగినేని కనకయ్య అని అన్నారు. గ్రామీణ ప్రాంతమైన తాడికొండలో అనేక విద్యాసంస్థలను స్థాపించి ఎంతో మందికి చదువుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. తొలుత కనకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు, ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, చారులత, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య, తహసీల్దార్ కె.నాసరయ్య, త్రిపురనేని మల్లేశ్వరరావు, డాక్టర్ కుర్ర అమల, సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నీటి సంఘం అధ్యక్షుడు జి.మధుసూదనరావు, ఎడ్డూరి ప్రసన్నకుమార్, మన్నె రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు ఏవీవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఎన్.రమణయ్య, చంద్రశేఖర్, ఎం.రవి పాల్గొన్నారు.



## ఇంటిని కోల్పోయాం.. పరిహారం అందించండి

● పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ

● 53వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ



వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన ఒరవడి సృష్టిస్తూ మంత్రి లోకేశ్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. శనివారం ప్రజాదర్బార్ 53వ రోజుకు చేరుకోగా మంగళగిరి నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ వర్గాల ప్రజల నుంచి లోకేశ్‌కు అనేక విజ్ఞప్తులు వచ్చాయి. వారి సమస్యలు సావధానంగా విన్న లోకేశ్ పరిష్కరిస్తానని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పలు సమస్యల పరిష్కారం కోసం సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

### ప్రజల ఆవేదన...

వంశధార ప్రాజెక్టు కింద కోల్పోయిన తన ఇంటికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కొల్లివలస గ్రామానికి చెందిన భవిరి సింహాచలం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కింద ఇల్లు కోల్పోవడంతో ఆధారం లేక భార్య, నలుగురు పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పరిహారం అందించాలని, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసినా అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. టిడ్కో ఇంటి కోసం నగదు చెల్లించినప్పటికీ అలాట్ అయిన ఇంటిని మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విజయవాడ రాజరాజేశ్వరి పేటకు చెందిన షేక్ రేష్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పసుపు కుంకుమ కింద తనకు సంక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు పట్టాదార్ పాస్‌పుస్తకం మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా మిట్టపాలెంకు చెందిన కొమ్మినేని చిన్న వెంకటరమణమ్మ విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో ఎనిమిదేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రకాశం జిల్లా తూర్పు వెంకటాపురంకు చెందిన జంపాల రామరావు లోకేశ్‌కు అర్జీ అందించారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. గ్రామ శివారులోని ఆర్ అండ్ బీ బ్రిడ్జిని కూడా విస్తరించాలని కోరారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాసులురెడ్డి తన 28 అంకణాల స్థలాన్ని కబ్జా చేశారని, విచారించి న్యాయం చేయాలని పున్నూరు రాఘవయ్య లోకేశ్‌ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. 1994లో ఎంఆర్‌వో కార్యాలయం ఎదురు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేశానని, తన స్థలం పక్కనే సుబ్బారాయుడు స్థలం ఉందనీ, అతడు అతని స్థలంతోపాటు నా స్థలాన్ని కూడా శ్రీనివాసులు రెడ్డికి విక్రయించాడని, దౌర్జన్యంగా ప్రహరీ గోడ కట్టారని పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేదని వాపోయారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ చెప్పారు. పెన్షన్ అందించడంతోపాటు తమ సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు పలువురు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందించగా పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

## సాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కేంద్రీయ జలశక్తి సభ్యులు



సాగర్ ప్రాజెక్ట్ పరిశీలనలో కేంద్రీయ జలశక్తి సభ్యులు

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను శనివారం కేంద్రీయ జలశక్తి సభ్యులు పరిశీలించారు. నాగార్జున సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీ, వాక్‌వే, స్పిల్‌వే, జలవిద్యుత్ కేంద్రంను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రీయ జలశక్తి సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ డ్యాం రీహాబిటేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్ట్‌ను పరిశీలించి శనివారం ఇక్కడకు వచ్చామన్నారు. ప్రాజెక్ట్ పటిష్ఠ కోసం అమలు చేయాల్సిన పనులను పరిశీలించి నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కృష్ణా జలాల వినియోగంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న విభేదాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ డ్యాం పటిష్ఠతకు ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలో రూ.160 కోట్లతో ప్రతిపాదనలు పంపారన్నారు. తమ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ పరిశీలనలో కేంద్రీయ జలశక్తి జాయింట్ కమిషనర్ మనోజ్‌కుమార్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు డీఈ అజయ్‌యాదవ్, జేఈ రాజేష్, ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీధర్‌రావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈలు శ్రీనివాస్, మురళీధర్, ఏఈలు సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండానే..

● మిర్చియార్డులో కొందరు అధికారులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు

● తాము ఫిబ్రవరి నెలలో బదిలీపై వచ్చామని ఆవేదన

● అక్రమాలు జరిగిందంతా అంతకుముందని నివేదన

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక అందరిని విస్మయానికి గురి చేస్తుంది. కలెక్షన్ కింగ్‌లను వదిలేసి ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి నెల ముందు బదిలీపై వచ్చి విధుల్లో చేరిన వారిపై చర్యలకు సిఫార్సు చేయడానికి కారణాలు ఏమిటో వారికే తెలియాలని మార్కెటింగ్ వర్గాలు వాపోతున్నాయి. మొత్తం 20 మందిపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. వారిలో ఏడు, ఎనిమిది మంది సూపర్‌వైజర్లపై తగిన అభియోగాలను నమోదు చేయలేదు. సిఫార్సుల్లో మాత్రం యాక్షన్ తీసుకోవాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో తమ విజ్ఞప్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులకు ఆయా సూపర్‌వైజర్లు నివేదించారు.

### నివేదికలో కొరవడిన స్పష్టత

మిర్చియార్డులో లైసెన్సుల రెన్యువల్స్, ప్రొప్రయిటర్ల పేర్ల మార్పులో రూ. కోట్లు చేతులు మారాయన్నది ప్రధాన అభియోగం. దీనిపై అప్పటి చైర్మన్ ఎం. సుధాకర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. అలానే అప్పటి సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి పైనా డిపార్టుమెంటల్ యాక్షన్ తీసుకోవాలని సూచించింది. ఈనామ్‌లో అక్రమాలు 2019 జూన్ నెల నుంచి జరుగుతూ వచ్చాయి. అయితే అప్పటి నుంచి ఈ ఏడాది మిర్చి సీజన్ వరకు ఎవరెవరు అక్రమాలకు పాల్పడ్డారనే దానిపై నివేదికలో స్పష్టత కొరవడింది. యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ చేసిన ఫిర్యాదులో కొంతమంది అధికారుల పేర్లను ప్రస్తావించారు. అయితే విజిలెన్స్ నివేదికలో వారి పేర్లు గల్లంతయ్యాయి.

### రూ. కోట్లు పోగేసుకొన్న వారిని వదిలి..

ఎవరైతే ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు బదిలీపై వచ్చారో వారిపై యాక్షన్ తీసుకోవాలని సిఫార్సు చేసి అంతకుముందు పెద్దఎత్తున జీరో, కటింగ్ బిజినెస్‌లను విస్మరించి రూ. కోట్లు పోగేసుకొన్న వారిని వదిలి పెట్టడంపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో వారి పాత్రని విజిలెన్స్ పసిగట్టలేక పోయిందా... యార్డులో సమాచారం ఇచ్చిన సిబ్బంది మాయ చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేయడం, కొందరి పేర్లు గల్లంతు కావడం, నివేదికలో స్పష్టత లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చేసుకొని మార్కెటింగ్ శాఖ తీసుకోబోయే చర్యలపై యార్డువర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. నివేదిక ఆధారంగా మార్కెటింగ్ శాఖ ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

### సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 568.60 అడుగులు ఉంది. ఇది 253.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,484 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 49,859 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



## ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ కీలక భూమిక

● ఖర్చు తగ్గించి దిగుబడులు పెరిగేలా రైతుల్లో చైతన్యం తేవాలి

● వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

● విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు



ఆదర్శ రైతు దంపతుల్ని సత్కరిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, డాక్టర్ లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని, డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడం వలన వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని, పంటలో ఎక్కడైతే చీడపురుగులు ఉన్నాయో అక్కడే డ్రోన్ టెక్నాలజీతో మందులు పిచికారి చేయవచ్చని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా "అభ్యుదయ రైతుల పురస్కారాల పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభ్యుదయ రైతు దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అచ్చెనాయుడు మాట్లాడుతూ డ్రోన్స్‌ను ఒకప్పుడు పెళ్లిళ్ల వంటి కార్యక్రమాల్లో ఉపయోగించే వారనీ, కానీ ప్రస్తుతం వ్యవసాయంలో వీటి వినియోగం విరివిగా ఉందన్నారు. పంటకు పట్టిన తెగులును రైతు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో శాటిలైట్, క్లౌడ్ టెక్నాలజీ వినియోగించి భూసార పరీక్షలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ రసాయన ఎరువులను వినియోగించి సాగు చేయడం వలన అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని దేశంలోని అందరూ ఒకేసారి కాకుండా, మెల్లమెల్లగా విస్తీర్ణాన్ని పెంచుకుంటుపోవాలని హితవు పలికారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిస్తూ ఆదర్శ రైతులను సన్మానించడంతో పాటు వారి ఆలోచనల్ని తెలుసుకునేందుకు ఇది మంచి కార్యక్రమం అన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ నూతన వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతలపై ఫౌండేషన్ తరుపున రైతులకు శిక్షణ ఇస్తామని తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిథులను, రైతు దంపతులను ఘనంగా సన్మానించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన దర్శి శేషారావు ప్రకృతి అభ్యుదయ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ జన్మదిన వేడుకలు



జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది అభిమానుల మధ్య ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 48వ జన్మదిన వేడుకలు శనివారం క్రోసూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 48 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ కట్ చేశారు. మత పెద్దలు ఆయన్ను ఆశీర్వదించారు. వివిధ దేవాలయాల నుంచి వచ్చిన పూజారులు వేద ఆశీర్వచనం పలికి ఆయా దేవాలయాల దేవుళ్ల, అమ్మవార్ల చిత్రపటాలను ఎమ్మెల్యేకు బహూకరించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఎర్రబాలెం నుంచి సభా ప్రాంగణం, మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లో అభిమానులు గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ర్యాలీలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన వేలాది మంది అభిమానులు పాల్గొన్నారు. అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎమ్మెల్యేకు పూల బొకేలు అందజేసి శాలువాలు, పూల దండలు వేసి ఘనంగా సత్కరించారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వందలాది మంది టీడీపీ అభిమానులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్మదిన వేడుకల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు నివేదికలు సమర్పించినట్లు తెలిపారు. నియోజకవర్గానికి మరొక మోడల్ స్కూల్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జన్మదిన వేడుకలను నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. క్రోసూరు మండలానికి చెందిన నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోక వెంకటరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ధూళ్ల సాంబశివరావు, దుద్దుల యోహాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు ఏపూరి నాగేశ్వరరావు, కాంద్రు కాశయ్య, పార్టీ నాయకులు నలజాల సదాశివరావు, గుడిపాడు బాషా, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు ఉన్నారు. పార్టీ పెదకూరపాడు మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, అమరావతి మండలానికి చెందిన పంచాయతీ రాజ్ చాంబర్ జాతీయ ఉపాధ్యక్షుడు జాష్టి వీరాంజనేయులు, పార్టీ అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, బెల్లంకొండ మండలానికి చెందిన మస్తాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

## టైపింగ్‌లో హరితకు ప్రథమ ర్యాంకు



వేమూరు, మంగళగిరి జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన ఆరాధ్యుల హరితసాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు 2024లో నిర్వహించిన తెలుగు టైప్ లోయర్ గ్రేడ్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును సాధించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో తమ బంధువుల వద్ద ఉండి మంగళగిరిలోని మాధవి టైపు ఇనిస్టిట్యూట్ ద్వారా తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షకు హాజరైంది. 200 మార్కులకు గానూ 196 మార్కులను సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హరితసాయికి మాధవి టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు పి.మురళీధర్, సహచర విద్యార్థులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 113,121,132 |
| చికెన్ విత్ స్కిన్ | 216.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 226.00 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



## పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 39.11 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కుల గణనలో తప్పులను సరిచేయాలి

వెల్దుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి విడుదల చేసిన కుల గణాంకాల జాబితాలో తప్పులను ఉన్నాయని, సరిచేయాలని కోరుతూ శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ బాషాకు ఎమ్మార్పీఎస్ నేతలు వినతిపత్రం అందించారు. జాబితాలో మాదిగలను మాలలుగా, హిందూ మాదిగలను క్రైస్తవ మాదిగలుగా చూపారని, వీటిని సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో వారిలో కొమ్ము కిషోర్, సురేష్, మల్లయ్య, యాకోబు, జక్రయ్య, ఆనందబాబు, రాజేష్, దావీదు, వె

## కూల్‌డ్రింక్ షాపునకు నిప్పు

కారంపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొదమగుండ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గొర్రెమల్ల ఆవులయ్య కూల్‌డ్రింగ్ షాపును శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టి దహనం చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు శనివారం గ్రామానికి చేరుకొని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఆవులయ్యకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం కారంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, బీసీ సెల్ అధికార ప్రతినిధి గోరంట్ల నాగేశ్వరరావు, యరగాని మల్లికార్జునరావు, జక్కుల గురువులు, వెన్నా హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

కారంపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెవారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సుంకర లాజరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు శనివారం గ్రామానికి చేరుకొని లాజరు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా

## బోయ నాగిరెడ్డి నియామకం

రెంటచింతల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా బోయ నాగిరెడ్డిని నియమిస్తూ బీజేపీ సంస్థాగత ఎన్నికల అధికారి బొగ్గవరపు మస్తాన్‌రావు శనివారం నియామక ప్రతాలను అందచేశారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తానని ఈ సందర్భంగా నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పి కాశీపతి, పాశం మట్టారెడ్డి, తాజా మాజీ అధ్యక్షుడు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

యార్డు ఎగుమతిదారుల సంఘం

## అధ్యక్షుడిగా నరసింహారావు

దాచేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోలు ఎగుమతిదారుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మాచవరం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా పులిపాటి దత్తు ప్రదీప్ కుమార్, షేక్ సలీమ్(ఎబిసి), ప్రధాన కార్యదర్శిగా జిల్లెలమూడి శ్రీకాంత్, ఉప ప్రధాన కార్యదర్శిగా మేకల శేషిరెడ్డి, కోశాధికారిగా జిల్లెలమూడి శ్రీకాంత్, కార్యదర్శిగా మామిడి చంద్రశేఖరరావు, పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకు న్నారు. నూతన సభ్యులంతా మార్కెట్ యార్డు సిబ్బంది సాంబశివరావు, వెంగళ రావుకు తమ నియామకపత్రాలను అందజేశారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

మాచర్లటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీసీ కెమెరాల టెక్నీషియన్ జలగం శ్రీహరి కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న దేవనపల్లి శ్రీనివాసరావు (అప్పి) శనివారం శ్రీహరి గృహానికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. తన వైద్యానికి సుమారు రూ. 25 లక్షల దాకా ఖర్చవుతుందని, దాతలు ఆదుకోవాలని శ్రీహరి కోరారు. కార్యక్రమంలో పెద్దారపు శివ, మస్తాన్‌రావు, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ హుండీ ఆదాయం రూ. 1,31,046

కారంపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న చెన్నకేశవస్వామి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. మొత్తం రూ. 1,31,046 ఆదాయం సమకూరింది. ఈవోలు హనుమంతురావు, శివనాగిరెడ్డిలు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కోమందూరి సత్యనారాయణచారి పాల్గొన్నారు.

## వైభవంగా శంఖాభిషేకం

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంను పురస్కరించుకొని శనివారం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో వున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు కొండవీటి రాఘవాచార్యులు ఆధ్వర్యాన 108 మంది మహిళలు స్వామి వారికి శంఖాభిషేకం జరిపారు. కార్యక్రమంలో భవనాసి వెంకటేశ్వర్లు, కాలంగి నాగేశ్వరరావు, సోమిశెట్టి రామకృష్ణ, నాగరాజు, బచ్చు శ్రీనివాసరావు, ఓబులశెట్టి హనుమంతురావు, కండే శివపార్వతి, శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు..

- మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు అభినందనీయం
- కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన
- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అడిగిన వారికి లేదనకుండా అన్న పెట్టిన మహనీయురాలు డొక్కా సీతమ్మ.. ఆమె పేరును ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం అభినందనీయమని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా జూనియర్ కళాశాల్లోని విద్యార్థులకు కూటమి ప్రభుత్వం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను మరింతగా పరిపుష్టం చేసేందుకు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శేర్రెడ్డి గోపిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, నేతలు పాల్గొన్నారు.



జెట్టిపాలెం మోడల్ స్కూల్లో అన్నం వడ్డిస్తున్న ప్రిన్సిపాల్

**రెంటచింతల, (ఆంధ్రజ్యోతి):** మాచర్ల నియోజకవర్గంలో 4 మోడల్ స్కూళ్లలోని కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని వర్తింపచేస్తూ ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాపయ్య, సుమంత్, బాలస్వామిలు ప్రారంభించారు.

**పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి):** పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, కూటమి నేతలు డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఎంపీడీవో సిహెచ్ రామచంద్రరావు, తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌అలి, పిల్లిచెన్నారావు, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, జొన్నలగడ్డ శ్రీను, మందా డేవిడ్, విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి):** దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు, కూటమి నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తెలనాకుల సత్యనారాయణ, దాచేపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంఇఓ పినాకపాణి తదితరులు పాల్గొన్నారు.

**దుర్గి, (ఆంధ్రజ్యోతి):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ వేణు, ఎంఈవో బెంజిమెన్, ఎంపీటీసీ గోపాలరావు ప్రారంభించారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల కృష్ణయ్య, ఆంజనేయులు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ నగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, జనసేన నేత కటికం అంకారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నేతలు పలువురు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎనిగండ్ల కోటయ్య, పసుపులేటి పాపిరెడ్డి, బత్తుల శ్రీనివాస్, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాల కాశినాయక్,జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



గురజాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్

**బెల్లంకొండ,(ఆంధ్రజ్యోతి):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్నిరాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, టీడీపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తులఉమాదేవి, సర్పంచ్ జ్యోతి సముద్రం, పీఎస్‌కే రసూల్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండెపూడి హైస్కూల్లో భోజనం పంపిణీ చేస్తున్న అధికారులు

**అమరావతి, (ఆంధ్రజ్యోతి):** మండెపూడి ఉన్నత పాఠశాలలోని ఇంటర్ విద్యార్థులకు డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనపథకాన్ని ఎంఈవో శివబాబు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పీ.రామకృష్ణ, వై శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ పీ. సతీష్, ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణాదేవి తదితరులు పాల్గొని ప్రారంభించారు.

**క్రోసూరు, (ఆంధ్రజ్యోతి):** క్రోసూరులోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ మేరీ సూజన్, ఎంఈవో - 2 గణేష్, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ రఫీలు ప్రారంభించారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో

## దొడ్లేరు హైస్కూల్ ఉపాధ్యాయుడి ప్రతిభ





కలెక్టర్ అరుణబాబు చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న ఉపాధ్యాయుడు మణికంఠ

క్రోసూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో నరసరావుపేటలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో క్రోసూరు మండలం దొడ్లేరు జిల్లా పరిషత్ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు వై.మణికంఠ ఉత్తమ ప్రతిభకనబరిచి ప్రథమస్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మలత తెలిపారు. మణికంఠ తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట ఫైర్ ఫైటింగ్ రోబోట్‌కు పల్నాడు జిల్లాస్థాయిలో ప్రథమస్థానం లభించినట్టు తెలిపారు. మన జిల్లా తరుపున మణికంఠ ఈనెల 7న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయిలో 31వ తేదీన జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో దొడ్లేరు హైస్కూల్ విద్యార్థులు షేక్ జాఫర్ సాధిక్, అబిద్ హుస్సేన్, శేఖర్‌లకు ప్రథమ స్థానం లభించింది. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ చేతుల మీదుగా ఉపాధ్యాయుడు మణికంఠ జ్ఞాపికను అందుకున్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు కూడా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన ఉపాధ్యాయుడిని, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పద్మలతతో పాటు సహచర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

# సత్తెనపల్లిలో నకిలీ జనన ధ్రువ పత్రాలు

- చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.. కమిషనర్

సత్తెనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో నకిలీ పుట్టిన తేదీ ధ్రువపత్రాల అంశం చర్చనీయాంశంగా మారింది. సత్తెనపల్లి పురపాలక సంఘంలో జనన,మరణాల నమోదు కేంద్రంలో 2024 జనవరి నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు 1513 జననాలు మాత్రమే జరిగాయి. అయితే నకిలీ సర్టిఫికెట్‌పై పుట్టిన తేదీ రిజిస్టర్ సంఖ్య 2 వేలకు పైగా ఉంది. విద్యార్థి ఆగస్టు 16, 2008న సత్తెనపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పుట్టినట్టు ఉండగా, ప్రైవేట్ ఆస్పత్రుల రికార్డుల్లో ఆ పేరు ఎక్కడా నమోదు కాకపోవడం గమనార్హం అలాగే 2020లో బదిలీ అయిన మునిసిపల్ కమిషనర్ పీ శ్రీనివాసరావు జూలై 15, 2024న సర్టిఫికెట్ నమోదుకాబడి, 2024 నవంబరు 6, జారీచేసినట్లు ఉందని, ఈ సర్టిఫికెట్ పూర్తిగా నకిలీదని మునిసిపల్ కమిషనర్ షమ్మి తెలిపారు. 2016 లోపు ప్రభుత్వ వైద్యశాలలో పిల్లలు జన్మిస్తే ఆస్పత్రి రికార్డుల ప్రకారం మునిసిపాలిటీలో వివరాలన్నీ నమోదవుతాయన్నారు. ఆస్పత్రి సర్టిఫికెట్ ఇచ్చినా మునిసిపల్ కార్యాలయంలో ఆ వివరాలు నమోదు కాకపోతే వాటిని నకిలీ సర్టిఫికెట్‌లుగా గుర్తిస్తామన్నారు. అలాంటి సర్టిఫికెట్లు తెచ్చిన వారిపై పోలీసులకు ఫిర్యాదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## హస్తకళా ప్రదర్శన పరిశీలన

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో హస్తకళా సేవా కేంద్రం, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సీహెచ్‌డీసీఎస్ కార్యక్రమంలో భాగంగా ఆప్కో ఆధ్వర్యాన జరుగుతున్న హస్తకళాకారుల డిజైన్ డెవలప్‌మెంట్‌ను శనివారం విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చేనేత,హస్తకళల పరిశ్రమ అభివృద్ధి చెందడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పీడీ సుధీర్‌కుమార్, పీ. కృష్ణమూర్తి పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

## టీడీపీ నేతకి ఎమ్మెల్యే పరామర్శ

మాచర్లటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన టీడీపీ నేత అలవాల శ్రీనివాసరెడ్డి ఇటీవల ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం ఆస్పత్రికి చేరుకొని శ్రీనివాసరెడ్డిని పరామర్శించారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని గ్రామాల్లో నెల రోజులుగా నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు పెదమద్దూరులో ఏర్పాటు చేసిన సదస్సుతో ముగిశాయి. ఆయా సదస్సులలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 121 అర్జీలు అందగా వాటిలో 62 పరిష్కరించినట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. పెదమద్దూరు సదస్సులో పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పీ.శ్రీనివాసరావు, మదన్‌మోహన్, సాంబశివరావు, అనిల్‌కుమార్, జార్జి, సతీష్ పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు

## స్టడీ మెటీరియల్ అందజేత

ముప్పాళ్ళ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నార్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం యూటీఎఫ్ నేతలు స్టడీ మెటీరియల్‌ని అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి గరికపాటి జానకి రామయ్య విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించేందుకు రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారని యూటీఎఫ్ మండల నాయకులు ముప్పా సురేష్ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మధుసూదనరావు, యూటీఎఫ్ నాయకులు పాలడుగు సుబ్బారావు, ఆవుల సురేష్, కొమరిశెట్టి విజయ్, షక్ షరీఫ్ బాషా తదితరులు ఉన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యూటీఎఫ్ నేత సురేష్

## అర్జీలకు వేగంగా పరిష్కారం

- వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

నకరికల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. నకరికల్లు మండలంలో 131 అర్జీలు రాగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 74 భూ సమస్యలను పరిష్కరించ గలిగామని తెలిపారు. మిగతా 57 సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఆర్‌వోఆర్‌కి సంబంధించి 100, సర్వేకి సంబంధించి 31 అర్జీలు అందాయని తెలిపారు. 45 రోజుల్లోగా వీటన్నింటినీ పరిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి) :** సత్తెనపల్లి మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా పట్టా దారు పాసు పుస్తకాల కోసం 76 దరఖాస్తులు రాగా 40 దరఖాస్తులను పరిష్కరించామని, అడంగల్ నమోదు పరిష్కరించామని తహసీల్దార్ చక్రవర్తి శనివారం తెలిపారు. అడంగల్‌లో పేరు నమోదు, ఇతర సవరణల కోసం 36 దరఖాస్తులు రాగా 21 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. సర్వే సవరణ కోసం రెండు దరఖాస్తులు రాగా పరిష్కరించామన్నారు. 22-ఏ సవరణల కోసం రెండు దరఖాస్తులు రాగా వాటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. రీ ప్లేస్‌మెంట్ పాసు పుస్తకాల కోసం ఒక దరఖాస్తు రాగా దానిని పరిష్కరించినట్టు ఆయన తెలిపారు.

**ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ముగిశాయని తహసీల్దార్ ఎం భవానీ తెలిపారు. నార్నెపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాలుగు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు, మండల సర్వేయర్ జీ సుధాకర్, కూటమి నేతలు రావిపాటి దేవేందరరావు, మల్లేశ్వరరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## అధికారులకు షోకాజ్ నోటీసులు

- బయోమెట్రిక్ వేయకపోవడంపై ఎంపీడీవో చర్యలు

నకరికల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలంలో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు వేయటంలో నిర్లక్షంగా వ్యవహరిస్తుండటంతో ఎంపీడీవో జీ కాశయ్య శనివారం వారికి షోకాజ్ నోటీసును జారీచేశారు. చేజర్ల సచివాలయం ఏఎన్‌ఎం పిడతల కుమారి, గుండ్లపల్లి -1 సచివాలయ ఏఎన్‌ఎం ఎం జ్యోతిబాయి, కుంకలగుంట- 1 సచివాలయ ఏఎన్‌ఎం ఆలోకం అనురాధలతో పాటు దేచవరం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ ఎస్‌కే రంజానూల్ షరీఫ్, కండ్లకుంటలో జే వీరాంజనేయులు, కుంకలగుంట -1లో షేక్ రెడా హుస్సేన్‌కు, ఇంజనీరింగ్ అసిస్టెంగ్‌గా రూపెనగుంట్లలో విధులు నిర్వహిస్తున్న ఎస్ తిరుమలరావు, విలేజ్ సర్వేయర్‌గా కండ్లకుంటలో పని చేస్తున్న కే రోజా నాగ సునంద, దేచవరంలో వగ్గా నరేష్, వ్యవసాయ శాఖకు చెందిన గుండ్లపల్లి-2లో ముడుసు సంధ్యారాణి, కండ్లకుంటలో ఎం శ్రీనివాసరావులకు నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేకుండా సకాలంలో విధులకు హాజరు కావటంలోను, బయోమెట్రిక్‌ను సకాలంలో వేయటంలోను నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వీరందరికీ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. 24 గంటల్లో తగు వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యల నిమిత్తం వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఎంపీడీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రక్తదానం చేసిన బాపిరాజుకి ఎన్టీఆర్‌ట్రస్ట్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే ప్రవీణ్‌కు శుభాకాంక్షల వెల్లువ

- నియోజకవర్గంలోని మండలాల్లో ఘనంగా వేడుకలు

అచ్చంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన అచ్చంపేటలో శనివారం పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ పుట్టిన రోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, బత్తుల శ్రీనివాసరావు, కొలగాని సత్యనారాయణ, పసుపులేటి పాపిరెడ్డి, తిరువాయిపాటి ఆంజనేయులు, జంపాని నాని, గంధం కోటేశ్వరరావు, యడ్లపల్లి బుచ్చిబాబు, నల్లపాటి చందు, కోట చంటి, నల్లగట్ల సత్యం, బ్రహ్మానాయుడు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ పుట్టిన రోజు సందర్భంగా డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌ను సత్కరించారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు రక్తదానం చేయగా ఆయనకు ఎన్టీఆర్ ట్రస్ట్ ధ్రువ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అందజేశారు.



ఎమ్మెల్యే ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హనుమంతరావు నాయక్

**బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) :** ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ జన్మదిన వేడుకల సందర్భంగా క్రోసూరు మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ప్రవీణ్‌ను పెదకూరపాడు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, బెల్లంకొండ మండల న్యూచిట్యాల ఆర్ అండ్‌ఆర్ సెంటర్‌కు చెందిన హనుమంతరావు నాయక్ కలిసి దుశ్శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, మాచాయపాలెం మాజీ ఎంపీటీసీ గుడిసె కొండయ్య, పీఎస్‌కే రసూల్, గంగిరెడ్డిపాలెం సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

**పెదకూరపాడు,(ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీకాకతీయ ఎడ్యుకేషనల్‌సొసైటీ ఆధ్వర్యంలో పెదకూరపాడు పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు ఎమ్మెల్యే ప్రవీణ్ సోదరుడు నవీన్ వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, కాతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు ఎస్.సాంబశివరావు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి బీవీ లలిత బాబు, మండల టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎంను పరిశీలించిన క్లూస్ టీమ్

నకరికల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు సర్వీస్ రోడ్డులో దుండగులు పగల గొట్టిన ఇండియా - 1 ఏటీఎంను శనివారం పల్నాడు జిల్లా క్లూస్ టీమ్ పోలీసు అధికారులు ఆధారాలను సేకరించారు. సీసీ ఫుటేజ్‌ని పరిశీలించారు. ఇద్దరు అగంతకులు ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గతంలో ఇదే ఏటీఎంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మళ్లీ ఇదే ఏటీఎంను పగల గొట్టడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన

మాచర్లటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన వైద్యులు విజయకుమారి, మారేపల్లి భవ్యశ్రీలు మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలకు వయసుతో పాటు ఏర్పడే అనేక సమస్యలు వస్తుంటాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మీ, రాదా, రామకోటయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం



పిడుగురాళ్లలో ర్యాలీ చేస్తున్న భవిత పాఠశాల దివ్యాంగులు

మాచర్లటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషావలి ఆధ్వర్యాన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకరరావు, విశ్రాంత డీవైఈవో గాదె రామకృష్ణారావులు లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ సంధ్యారాణి, రంగా శేషు, ఆవుల వెంకటేశ్వర్లు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి):** ముప్పాళ్ళ హైస్కూల్లోని భవిత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో ఎం సీతారామిరెడ్డి పాల్గొని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రమ్మ, ప్రత్యేక ఉపాధ్యాయులు పీ అర్జున్, ఎల్ శ్రీను, ఏ శ్రీలత తదితరులు ఉన్నారు.

**నకరికల్లు, (ఆంధ్రజ్యోతి) :** చూపులేని వారు చదువుకొనే అవకాశాన్ని కలిగించిన మహోన్నత వ్యక్తి బ్రెయిలీ లూయీ అని స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మేదరమెట్లస్వామి అన్నారు. పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బీ.రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు లక్ష్మి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ మల్లికార్జునరావు, అంజమ్మ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల,(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని భవిత పాఠశాల దివ్యాంగులు లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. మానసిక సామర్థ్యానికి వైకల్యం అడ్డుకాదని, ఆత్మవిశ్వాసం వుంటే ఏదైనా సాధించవచ్చునని, అంధుల కోసం కంప్యూటర్ పరిజ్ఞానానికి అనుగుణంగా బ్రెయిలీ లిపిని రూపొందించిన ఘనుడు లూయిస్ బ్రెయిలీ అని భవిత పాఠశాల రిసోర్స్ పర్సన్స్ మారం అజిత్‌కుమార్, హరికుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.


కృష్ణనగర్‌లోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీజీపీ తిరుమలరావు


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న డీజీపీ, చిత్రంలో ఓవీ రమణ తదితరులు

## ఆ జ్ఞాపకాలన్నీ మధురాతిమధురం

● విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించిన డీజీపీ
● అణువణువూ పరిశీలించి ఆనందానుభూతి
● ప్రాథమిక విద్యే పునాది అంటూ విద్యార్థులకు సూచన

గుంటూరు సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తాను ఎంత పెద్ద అధికారి అయినా ఒకప్పుడు విద్యార్థినే అన్న విషయాన్ని డీజీపీ ద్వారకా తిరుమలరావు మర్చిపోలేదు. ఎంత ఎత్తుకు ఎదిగినా అలనాటి జ్ఞాపకాలు మనసు లోతుల్లో పదిలంగా ఉంటాయన్న వాస్తవాన్ని రుజువు చేశారు. తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన గుంటూరు కృష్ణనగర్‌లోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని అణువణువూ పరిశీలించి మధురానుభూతిని పొందారు. చిన్నతనంలో ఆడుకున్న ఆట స్థలం.. మధ్యాహ్నం చెట్టుకింద కూర్చుని భోజనం చేసిన ప్రదేశం..స్నేహితులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన పాఠశాల ప్రాంగణం అంతా తిరిగిచూసి మరోసారి 1970 దశకంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న విద్యార్థులతో డీజీపీ తిరుమలరావు భావోద్వేగంతో మాట్లాడారు. 1970-74 మధ్యకాలంలో ఇదే పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివానని చెప్పారు. అప్పటి హెడ్మాస్టర్ సుబ్బారావు నేర్పిన క్రమశిక్షణ తమ ఎదుగుదలకు ఎంతో ఉపకరించిందన్నారు. తనతో పాటు ఇదే పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు డీజీపీలుగా, డాక్టర్లుగా, ప్రభుత్వ ఉన్నతోద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారని తెలిపారు. ప్రాథమిక విద్యే అన్నింటికీ పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు బాధ్యతతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియో వైద్యుడు ఓవీ రమణ మాట్లాడుతూ ఆనాటి జ్ఞాపకాలను మర్చిపోలేమని చెప్పారు. ఈ పాఠశాల తమకు ఎంతో చేసిందన్నారు. ఈ సందర్భంగా పెద్ద బాలశిక్ష, ఇతర పుస్తకాలు, వస్తువులను డీజీపీ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీం, రమణ, బషీర్, కరస్పాండెంట్ టీ శ్రీరామమూర్తి, సెక్రటరీ సమ్మోహిత్, మాజేటి గురవయ్య కాలేజ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, హెచ్‌ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్ఎం విధుల్లో చేరడంపై అనిశ్చితి

● తొలుత ఆనంద్ మధుకర్ నియామకం
● ఆయన ఆసక్తి కనబరచకపోవడంతో లిలీ పాండేయకు పోస్టింగ్
● ఆమె కూడా సాంస్కృతిక శాఖలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న అధికారి


లిలీ పాండేయ

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ పోస్టింగ్‌పై ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అధికారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు. దక్షిణమధ్య రైల్వేలో చిన్న జోన్ అన్న ముద్ర గుంటూరుకు ఉండటమే ఇందుకు కారణమన్న అభిప్రాయం రైల్వేవర్గాల్లో వ్యక్తమౌతున్నది. ఒకసారి డీఆర్ఎంగా విధుల్లోకి చేరితే కనీసం రెండేళ్లపాటు ఇక్కడ కొనసాగాల్సిందే. దీంతో ఢిల్లీ లాంటి పెద్ద నగరాల్లో విధులు నిర్వహణకు అలవాటైన రైల్వే అధికారులు గుంటూరుకు రావడానికి విముఖత కనబరుస్తున్నారు. డివిజన్ ఏర్పడిన కొత్తలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి డీఆర్ఎంలు బదిలీపై వచ్చి విధులు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు అలాంటి వాతావరణమే తలెత్తింది.

ప్రస్తుత గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ రెండేళ్ల పదవీకాలం ముగియడంతో ఆయన్ని రైల్వేబోర్డు బదిలీ చేస్తూ ఆనంద్ మధుకర్‌ని నియమించింది. దీనికి సంబంధించి గత నెల 26వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఢిల్లీలో గత కొన్నేళ్లుగా డిప్యూటేషన్‌పై రైల్వేకు చెందిన సాంస్కృతిక శాఖలో కొనసాగుతున్నారు. అయితే ఆయన గుంటూరు డీఆర్ఎంగా వచ్చేందుకు విముఖత కనబరిచారు. పైస్థాయిలో సిఫార్సులు చేయించుకొని తన పోస్టింగ్ ఆర్డర్స్‌ని రద్దు చేయించుకొన్నారు. దాంతో రైల్వేబోర్డు గత నెల 30వ తేదీన మరో అధికారి లిలీ పాండేయని గుంటూరు డీఆర్ఎంగా నియమించింది. అయితే ఆమె కూడా కేంద్ర సాంస్కృతిక శాఖలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. ఇది జరిగి దాదాపుగా వారం గడుస్తున్నా ఇప్పటివరకు లిలీ పాండేయ జాయినింగ్‌పై రైల్వేలో ఎలాంటి సమాచారం లేదు. ఇదే సమయంలో ఆమె కూడా డిప్యూటేషన్‌పై సాంస్కృతిక శాఖలో కొనసాగుతున్నందున వస్తారో, లేదోనన్న సందేహాలను రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. గుంటూరు రైల్వే డివిజన్ చిన్నది ఏమి కాదు. కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణం జరగబోతున్నది. అమరావతి నూతన రైలు మార్గం, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టులను రైల్వే శాఖ మంజూరు చేసింది. నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గంతో డివిజన్ పరిధి కూడా పెరిగింది. డీఆర్ఎంకు ఇక్కడ సకల సదుపాయాలున్నాయి. అయినప్పటికీ ఉత్తరాదికి చెందిన అధికారులు చిన్నచూపు చూస్తుండటంపై డివిజనల్ రైల్వేవర్గాలు అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నాయి.


పురందేశ్వరికి సమతా కుంభ్ ఆహ్వానపత్రికను అందజేస్తున్న చినజీయర్ స్వామి

## వేడుకగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

● హాజరైన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యదుకుల తిలకరత్న ట్రస్టు ఆధ్వర్యంలో మంగళగిరి బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. త్రిదండి చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు, అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తున్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ధనుర్మాస ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినజీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందుకున్నారు. శ్రీరామానుజాచార్యుల వారి 108 దివ్య దేశాల తృతీయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న సమతా కుంభ మేళా-2025 ఆహ్వాన పత్రికను చిన జీయర్ స్వామి, పురందేశ్వరికి అందజేశారు. కాగా, ధనుర్మాస ఉత్సవాల్లో 20వ రోజైన శనివారం 20వ పాశురాన్ని చినజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్, మంగళగిరి ప్రాంతాల నుంచి 300మంది భక్తులు గోదాదేవికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యదుకుల తిలకరత్న ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, ఉత్సవ నిర్వాహకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## హంపి విజయం తెలుగుజాతికి గర్వకారణం

● హంపిని అభినందించిన శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా చెస్ విజేత, తెలుగుతేజం కోనేరు హంపిని తాడేపల్లి మండలం కొలను కొండలోని ఆమె నివాసంలో ఏపీ స్పోర్ట్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 26 నుంచి 28 వరకు న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ రాపిడ్ ఉమెన్ చెస్ చాంపియన్ షిప్ 2024లో కోనేరు హంపి ప్రపంచ విజేతగా నిలవడంతో రవినాయుడు ఆమెను కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మహిళా చెస్ విజేతగా నిలిచి తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప జేశారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి యువతకు స్పూర్తి నివ్వాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ పాలసీని వివరించారు. క్రీడాభివృద్ధికి సూచనలివ్వాలని కోరగా ఆమె స్పందిస్తూ త్వరలోనే ఏపీ సీఎం చంద్రబాబును కలుస్తానని క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఆమెకు గన్నవరం ఎయిర్‌పోర్టులో శనివారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.


కోనేరు హంపిని అభినందిస్తున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

## దేహదారుఢ్య పరీక్షల్లో 119మంది మహిళా అభ్యర్థుల ఎంపిక


పరుగుపోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు రెండో రోజు శనివారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో 226మందికి గాను 119మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. పరీక్షలకు 256 మంది హాజరయ్యారు. వారిలో 30మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 226మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించారు. వారిలో 15మంది బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 211 మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 123మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. వీరికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 11మంది అర్హత సాధించారు. 123మందికి లాంగ్‌జంప్ నిర్వహించగా వారిలో 119మంది అర్హత సాధించారు. మొత్తం 226మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 119 మంది తదుపరి రాత పరీక్షకు అర్హత సాధించారు. 107 మంది విఫలమయ్యారు. మహిళా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులకు, అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి, కౌన్సిలర్లు

## డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు వ్యాఖ్యలపై దుమారం

● ఏం తమాషాలు చేస్తున్నారా అంటూ కమిషనర్, ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు
● ఏకవచనంతో దూషించడంపై కమిషనర్ బాయ్‌కాట్
● కేవలం ఏడు ప్రశ్నలపై మాత్రమే చర్చ
● కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటన

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. కమిషనర్ పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఉద్యోగులపై డైమండ్ బాబు మాట్లాడిన తీరును కమిషనర్ తీవ్రంగా ఎండగట్టారు. ఈ విధంగా మాట్లాడటం సభకు మర్యాద కాదంటూ డైమండ్ బాబు వ్యాఖ్యలపై కమిషనర్ తీవ్రంగా అసహనం వ్యక్తం చేసి సభలో మేయర్‌కు వివరంగా చెప్పి ఆయన బాయ్‌కాట్ చేస్తూ వెళ్లిపోయారు. ఆయనకు సంఘీభావంగా ఉద్యోగులందరూ కూడా కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అలాగే డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ కార్పొరేటర్‌లు కూడా కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కట్ చేసి వెళ్లిపోయారు. దీంతో నగర మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వైసీపీ కార్పొరేటర్‌లు కూడా వెళ్లిపోయారు.

### దుమారం రేపిన డైమండ్ బాబు వ్యాఖ్యలు

కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలు సభలో సంచలనం కలిగించాయి. తన ప్రశ్నలు కాకపోయినప్పటికీ, అన్ని అంశాల్లో, విషయాల్లో, ప్రతి ప్రశ్నకు ఆయన జోక్యం చేసుకుంటూ మాట్లాడటం కౌన్సిల్లో పరిపాటిగా మారింది. ప్రతి కౌన్సిల్ లాగే ఈ కౌన్సిల్లో కూడా ఆయన వ్యాఖ్యలు అందర్నీ విస్తుబోయేలా చేశాయి. వాస్తవానికి వైసీపీ కార్పొరేటర్ షేక్ రోషన్ నగరపాలక సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ప్రశ్నలు వేశారు. ఆయన ప్రశ్నలకు కమిషనర్ పులి శ్రీనివాసులు సమాధానం చెబుతున్నారు. 'అసలు ఈ సమాధానం రాసిన వాడు ఎవడో పిలవండి.. వాడిని పిలవండి' అంటూ డైమండ్ బాబు వ్యాఖ్యలు చేశారు. కౌన్సిల్ ప్రారంభ దశలో కూడా ఆయన జీఎంసీ షాపుల లీజుల విషయంపై మాట్లాడుతూ అధికారులను తక్కువ భావంతో, చులకనగా మాట్లాడారు. ఇలా తరచూ మాట్లాడుతుండటంతో కమిషనర్ పులి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. 'నగరపాలక సంస్థ కౌన్సిల్‌కు సంబంధించి రూపొందించిన ఎజెండాలో ప్రతి అంశం మా కింది ఉద్యోగుల ద్వారా తెప్పించుకొని నేనే పూర్తి చేశాను. ఏదైనా ఉంటే నన్ను అడగండి. అన్నిటికీ నేనే బాధ్యత వహిస్తాను.' అంటూ కమిషనర్ వ్యాఖ్యానించారు. ఉద్యోగుల పట్ల అగౌరవంగా, అమర్యాదగా మాట్లాడొద్దు అంటూ కమిషనర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అయినా ఆగని డైమండ్ బాబు పదేపదే 'ఎవడు దీనిని తయారు చేసింది.. చెప్పండి అంటూ' మాట్లాడటంతో కమిషనర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. 'ఓ పక్క నేనేగా చెబుతుంది. అంతా నాదే బాధ్యత అని.. మీరు మళ్లీ అలా మాట్లాడితే ఎలా' అంటూ మండిపడ్డారు. ఈ విధంగా అయితే ఉద్యోగ బాధ్యతలు చేయలే మని, ఇలా మాట్లాడితే ఎంత బాధగా ఉంటుందో మీకు తెలుసా అంటూ మేయర్ ముందు తన బాధను విన్నవించి కమిషనర్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తూ బయటికి వెళ్లిపోయారు. ఆయనకు సంఘీభావంగా ఉద్యోగులంతా కమిషనర్‌తో పాటు వెళ్లిపోయారు. అప్పటి వరకు కౌన్సిల్ సమావేశంలో కేవలం ఏడు ప్రశ్నలు మాత్రమే చర్చించారు.

### నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

నగరపాలక సంస్థ కమిషనర్, ఉద్యోగులపై డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కమిషనర్ చాంబర్ నుంచి కౌన్సిల్ హాల్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. కౌన్సిల్ హాల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. డైమండ్ బాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. డౌన్ డౌన్ డైమండ్ బాబు అంటూ జీఎంసీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే ఆయన్ను డిప్యూటీ మేయర్ గా తొలగించాలని డిమాండ్ చేశారు.

### టీడీపీ బాయ్‌కాట్..

మధ్యాహ్నం కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన వెంటనే మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని కొనసాగించాలని ఆదేశించారు. అయితే ఎజెండా కాపీ చదివేందుకు కూడా ఉద్యోగుల అందుబాటులో లేరు. దీంతో వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల అభిప్రాయాలను తెలపాలని కోరారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ నుకవరపు బాలాజీ మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ఆ విధంగా మాట్లాడకూడదని, డైమండ్ బాబు వ్యాఖ్యలు సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామంటూ చెప్పగానే ఆయనకు సంఘీభావంగా టీడీపీ కార్పొరేటర్లు అందరూ వెళ్లిపోయారు. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ మనోహర్ నాయుడు ప్రకటించారు. కమిషనర్ వ్యవహరించిన తీరు సక్రమంగా లేదని వైసీపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాల్ బయట మీడియాతో నాయకులు మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కౌన్సిల్ ఘన నివాళులర్పించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, విభాగాధిపతులు పాల్గొన్నారు.

### డైమండ్ బాబుపై చర్యలకు రంగం సిద్ధం

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబుపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఆయనపై అనర్హత వేటు వేసేందుకు పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది.

### డైమండ్ బాబు వ్యవహార శైలిని ఖండించిన రాష్ట్ర అసోసియేషన్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసీపీకి చెందిన డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది పట్ల అనుచితంగా, అమర్యాదగా మాట్లాడిన విధానాన్ని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ ( ఏపీఎంసీఏ) అధ్యక్షుడు సీహెచ్. నాగ నరసింహరావు, ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, ఉపాధ్యక్షుడు చల్లా ఓబులేసు, భవాని ప్రసాద్, కోశాధికారి శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబును ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 679ను అనుసరించి డిప్యూటీ మేయర్ పదవి నుంచి, మున్సిపల్ కార్పొరేటర్ పదవి నుంచి తొలగించాలని, చట్ట ప్రకారం అతనిపై కఠినచర్యలు తీసుకొని, మున్సిపల్ కమిషనర్ల కు, అధికారులకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

### ఇలాంటి పరిణామాలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు

ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను సజావుగా నిర్వహించుకునే బాధ్యత అధికారుల దగ్గర నుంచి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరి మీద ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన పరిణామాల మీద ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం జరుగుతున్న ఈ సమావేశాల్లో ఇటువంటి పరిణామాలు ఏ మాత్రం ఆమోద యోగ్యంగా లేవని, ఇటువంటి ఘటనలను ప్రజలు ఎవరు హర్షించారని ఆమె పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వాలని, అదే సమయంలో సభను గౌరవంగా జరిపే బాధ్యత మేయర్, సభ్యుల మీద ఉందని అన్నారు. ఇప్పటికే నగరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ఇలా కౌన్సిల్ జరగకుండా చేయడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు.


సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

## ప్రభుత్వాస్పత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్స


మహాలక్ష్మీతో డాక్టర్ రమణ, డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గొంతు మింగుడు పడక సరిగా ఆహారం తీసుకోలేక, నాలుగేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సతో ఉపశమనం కలిగించారు. వివరాల్లోకి వెడితే... మచిలీపట్నంకు చెందిన ఏ మహాలక్ష్మీ (45) నాలుగేళ్లుగా ఎకలేషియా కార్డియా టైప్ -2 అనే సమస్యతో బాధపడుతోంది. దీని వల్ల ఆహారం మింగుడు పడకపోవడం, తిన్న ఆహారం గొంతులోనే ఉండిపోవడం, వాంతులవ్వడం, గుండె దగ్గర ఆగిపోవడం వంటి సమస్యలతో బాధపడుతుండేది.

ఏడాదిగా ఆమె మంచినీళ్లు కూడా సరిగా తాగలేకపోతోంది. ఇటీవల గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి చికిత్సకు వచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు అందే సమస్యను గుర్తించి డిసెంబరు 24న ఆమెకు ఆపరేషన్ చేశారు. ల్యాప్రోస్కోపిక్ హెల్లర్ కార్డియో మయాటమి విత్ డార్ ఫండప్లికేషన్ అనే పద్ధతిలో శస్త్రచికిత్స చేశారు. సర్జరీ విజయవంతం కావడంతో మహాలక్ష్మి చక్కగా ఆహారం తీసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఈ ఆపరేషన్ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. అరుదైన ఆపరేషన్‌తో యువతికి ఆరోగ్యం సమకూర్చిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు.

## సెంట్రింగ్ కార్మికుడి మృతి

చిలకలూరిపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గంగమ్మ గుడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్మెంట్ పై నుంచి కింద పడి సెంట్రింగ్ కార్మికుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావు పేటలోని వెంగళరెడ్డి కాలనీకి చెందిన శిరివేరి కోటేశ్వరరావు(35) ఇక్కడి ఒక అపార్టుమెంట్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. మూత్ర విసర్జనకు లేచిన సందర్భంలో ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన అర్బన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## రేపు టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం

గుంటూరు (తూర్పు) జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రమౌళి నగర్ .బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధ్యక్షతన సోమవారం ఉదయం 9 గంటలకు టెలికం అడ్వైజరి కమిటీ సమావేశం జరుగుతుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు .సమావేశంలో కమిటీ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవీడు, స్పైసెస్ పార్కు సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. కొత్తపాలెం, కోట, సొలస, లింగారావుపాలెం, సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, వంకాయలపాడు, కొండవీడు గ్రామాల పరిధిలోని పరిశ్రమలు , గృహ, వాణిజ్య సముదాయాలకు సరఫరా నిలిపివేస్తారన్నారు. వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా డీఈఈ కోరారు.

### ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో తనిఖీ

నరసరావుపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు శనివారం సాధారణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నరసరావుపేట మండలంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, ఏవో పేరిరెడ్డి, ఈవోపీఆర్డీ నాగానంద్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ బాషా, సీనియర్ అసిస్టెంట్ అపర్ణ, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, టైపిస్టు రజిని పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ

రొంపిచర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రస్తుతానికి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 140 టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. 11 కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి కొద్ది రోజుల్లోనే నగదు జమవుతున్నాయని తెలిపారు. అనంతరం మొక్కజొన్న పొలాలను పరిశీలించారు.

● రొంపిచర్లలో తెల్లశనగ పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. లాం ఫాం ప్రధాన శాస్త్రవేత్త నగేష్, డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

శావల్యాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులతో పాటు కళాశాలల్లోని విద్యార్థులకు కూడా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి వారిని ఎంతో ప్రోత్సహిస్తుందని ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి అన్నారు. శావల్యాపురం హైస్కూల్ ప్లస్‌లోని జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనపథకాన్ని శనివారం ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను అందించి ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం నోబుల్‌టీచర్స్ అసోషియేషన్ క్యాలెండర్‌ను ఎంఈవో, హెచ్‌ఎం, నాయకుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఎన్డీఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, సర్పంచ్ చెన్నమ్మ, నాయకులు కేవీఆర్ మోహన్‌చంద్, కామినేని లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు. శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శ కళాశాలలో..

ఈపూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ఏపీ ఆద ర్శ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎంఈవో ఏ రామతులసి శనివారం ప్రారంభించారు. పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఇంటర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఏపీ మోడల్‌స్కూల్లో ..

బొల్లాపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఎంపీడీవో పీ సీతారామయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీడీపీ నాయకులు బొల్లాపల్లి కోటేశ్వరరావు, షేక్ సుభాని, కందుల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### ఉపాధ్యాయుల వేతనాలు తక్షణమే చెల్లించాలి

నరసరావుపేట టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబరు నెల వేతనాలు అందలేదని వెంటనే చెల్లించాలని ఏపీటీఫ్ నాయకులు పమ్మి వెంకటరెడ్డి, బెజ్జం సంపత్‌బాబు శనివారం డిమాండ్ చేశారు. డిసెంబరు నెల జీతాలు కొన్ని ఉద్యోగ శాఖలు పెన్షనర్లకు చెలించారని అన్నారు. నేటి వరకు విద్యాశాఖలో రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు జీతాలు అందలేదన్నారు. బ్యాంకు లోన్లు, ఈఎంఐల చెల్లింపులు కట్టింగ్స్ నూతన సంవత్సరం ఖర్చుల రీత్యా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తక్షణమే ఉపాధ్యాయులకు డిసెంబరు నెల వేతనాలు చెల్లించాలని కోరారు.

### పాల్ ల్యాబ్‌లపై ఉపాధ్యాయులకు శిక్షణ

నరసరావుపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ): మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో గల శంకరభారతిపురం హైస్కూల్లో జిల్లాలో 24 కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులకు పాల్ ల్యాబ్‌లపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 24 పాల్ ల్యాబ్‌లు ఉండగా మరో 44 ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని సమగ్ర శిక్ష అభియాన్ పీఎస్‌పీడీ కే రవీంద్రనాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలో అర్థం చేసుకోలేని వాటిని ల్యాబ్‌ల ద్వారా అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఐఎస్ హైమేశ్వరరావు, సత్తెనపల్లి ఉప విద్యాధికారి ఏసుబాబు, జీసీడీవో రేవతి, నరసరావుపేట ఎంఈవో- 2 నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని పార్వతి, సయ్యద్ సాబీర్, రూపేష్, అజయ్‌కుమార్, హారిస్ పాల్గొన్నారు.

### విద్యార్థి భవిష్యత్తుకు ప్రాథమిక విద్య పునాది

● ఎంఈవో నాగరత్నం

యడ్లపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్య పునాది వంటిదని, అటువంటి విద్యను నిర్లక్ష్యం చేయకూడదని ఎంఈవో నాగరత్నం అన్నారు. స్థానిక నారాయణ ఇంగ్లిష మీడియం స్కూల్ 19వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో నాగరత్నం హాజరయ్యారు.

# తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు

● జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే విద్యార్థులను తీర్చిదిద్దాలని బృహత్తర సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని జూనియర్ కళాశాల్లో పేద విద్యార్థులకు ఆకలి తీర్చేందుకే నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సుమారు 400మంది విద్యార్థులకు నూతనంగా ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోని పేద విద్యార్థులకు ఆకలి తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నూతనంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కళాశాల్లో విద్యార్థులకు అవసరమైన అధ్యాపకుల భర్తీతోపాటు నిత్యం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యలో రాణించాలని సూచించారు. 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుచేశారని, వైసీపీ పాలనలో ఆ పథకాన్ని ఎత్తివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 475 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఈ పథకాన్ని అమలుచేస్తున్నారని, ఏడాదికి సుమారు 86వేల కోట్లు ప్రభుత్వంపై అదనపు భారం పడినప్పటికి విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భోజన పథకాన్ని పునఃప్రారంభించారు. గత వైసీపీ పాలనలో స్థానిక సంస్థల నిధులు ఎత్తుకొనిపోతే నేడు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం నిధులిచ్చి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని, జూనియర్ కళాశాల్లో మంచి మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు శివశక్తి ఫౌండేషన్ తరపున ప్రతిభా ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంఈవో జఫ్రుల్లా, ప్రిన్సిపాల్ ప్రభాకర్, బోయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం ఎపేల, కళాశాల అభివృద్ధి అధ్యక్షుడు గుడిపాటి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పత్తిపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రూ.102.26 కోట్లు బీమా చెల్లింపు

దేశ చరిత్రలో కోట్ల మంది కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పించిన ఏకైక రాజకీయ పార్టీ టీడీపీ అని, కార్యకర్తలను కుటుంబసభ్యులుగా భావిస్తూ సభ్యత్వంతో పాటే బీమా కల్పించిన చరిత్ర తెలుగుదేశానికే దక్కిందని జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముత్తినేని యశోద, వాసిరెడ్డి లింగమూర్తి, చందోలు మల్లికార్జునరావు, షేక్ సలీం రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని జీవీ నుంచి శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు బీమా చెల్లించడం మాటల్లో చెప్పడమే కాక రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 5.144మంది కార్యకర్తలకు రూ.102.26 కోట్లు బీమా డబ్బులు అందించడం పార్టీ చిత్తశుద్ధికి కార్యకర్తలపై ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమన్నారు. కార్యకర్తల బీమా కోసం ఇటీవలే మంత్రి లోకేశ్ యునైటెడ్ ఇండియా, ప్రాగ్మాటిక్ సంస్థలో ఒప్పందం చేసుకున్న అంశాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో డీసీ కొండలు, వెంకటరెడ్డి, వజ్రాల కృష్ణారెడ్డి, పెండాల శ్రీను, పీవీ సురేష్, మాదినేని ఆంజనేయులు పాల్గొన్నారు.

### లోకకళ్యాణార్థం ధనుర్మాస పూజలు

ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమం, శ్రీకృష్ణ ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్, జీవీ ఆంజనేయులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎస్సీ కులగణన వివరాలు ప్రదర్శించాలి

● జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే

నరసరావుపేట రూరల్, జనవరి 4 : (ఆంధ్రజ్యోతి ) గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ అధికారులను ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల కాల గడువు పూర్తయినందున త్వరలో నూతన కమిటీ సభ్యులను నియమిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెలా నాలుగో శనివారం కలెక్టరేట్‌లో పౌరసేవల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

### జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్ష




సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్ష శనివారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గగోరే అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీవో.) యాక్ట్, 1989, ది బాండెడ్ లేబర్ సిస్టం (ఎబొలిషన్) యాక్ట్, 1976, ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్స్, 2013, ది ఏపీ దేవదాసిస్ (ప్రొహిబిషన్ ఆఫ్ డెడికేషన్) యాక్ట్ 1988 అమలుపై జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీఆర్వో మురళి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి (ఇన్‌చార్జి) శివనాగేశ్వరరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వాల కృషి ప్రశంసనీయం

● గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత రామిరెడ్డి



మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న రామిరెడ్డి, ఎంఈవో

నాదెండ్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలలో రామిరెడ్డి సేవాసమితి వారు రూపొందించిన 2025 గ్రామాభివృద్ధి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏపీ మోడల్ పాఠశాలలో గల జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో కృష్ణారెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యతోనే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి, హెచ్‌ఎంలు సుందరరావు, కరీముల్లా, పెద్దలు వై శివారెడ్డి, బీ శ్రీనివాసరెడ్డి, ఐనవోలు రాధా, కమలాకర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అంతర విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలకు కృష్ణవేణి విద్యార్థి

నరసరావుపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత అంతర విశ్వవిద్యాలయం క్రికెట్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ నెల 3న యూనివర్శిటీ క్రీడా ప్రాంగణంలో ఏఎన్‌యూ క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. బౌలింగ్ విభాగంలో జీ ప్రవీణ్‌కుమార్ ప్రతిభ కనబరిచి ఏఎన్‌యూ క్రికెట్ జట్టుకు ఎంపియ్యాడు. చెన్నైలోని మద్రాస్ యూనివర్శిటీలో ఈ నెల 16 నుంచి 21 వరకు జరిగే దక్షిణ బారత విశ్వవిద్యాలయం క్రికెట్ పోటీల్లో ఏఎన్‌యూ జటుకు ప్రాతినిధ్యం వహిస్తాడని పీడీ ఈదర ఆదిబాబు అన్నారు. ఎంపికైన ప్రవీణ్ కుమార్‌ను వైస్‌ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

### క్షయ నియంత్రణ విభాగంలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నరసరావుపేట టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో 17పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ రవి శనివారం తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జాతీయ జాతీయ క్షయ నిర్మూలన పథకంలో ఏడాది పాటు కాంట్రాక్ట్ విధానంలో పనిచేసేందుకు పోస్టును భర్తీ చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు పల్నాడు. ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.





## అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎక్కడా అనధికార లేఅవుట్లు ఉండటానికి వీల్లేదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన ఇక్కడ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ధనార్జనే ధ్యేయంగా తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థలు లేకుండా వేసిన లేఅవుట్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపబోతోందని ఆయన ప్రకటించారు. చెరువులు, కుంటలు, కాలువలతో సహా చుక్కల నిషేధిత భూములను కొందరు ఆక్రమించారని, సదరు ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాదును కోరినట్లు పుల్లారావు తెలిపారు. సొంతింటి కల సాకారం చేసుకోవాలను కునే పేద, మధ్యతరగతి వర్గాల వారికి సౌకర్యాలు కల్పించకుండా లే అవుట్లు వేసి మోసం చేయడం క్షమించరాని నేరమన్నారు.

### మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

స్థానిక శారదా జడ్పీ హైస్కూల్లోని జూనియర్ కళాశాలలో, యడ్లపాడులోని మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యా ర్థుల కోసం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయడం ద్వారా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చరిత్ర సృష్టించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు తోట రాజారమేష్, షేక్ కరీముల్లా, సుభాని, పఠాన్ సమద్‌ఖాన్, రవి, ఎంఈవో లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ప్రత్తిపాటి

### షటిల్ పోటీలు ప్రారంభించిన ప్రత్తిపాటి

స్థానిక సీఆర్ క్లబ్‌లో శనివారం గుమ్మడి పవన్ కుమార్ స్మారక ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19, అండర్-18 షటిల్ పోటీల్లో గెలుపొందిన చెన్నుపాటి లక్ష్మీ పల్లవి, చెన్నుపాటి లోకేశ్వరిని ఆయన అభినందించారు. మొత్తం 38 చిలకలూరిపేట ప్రాంత టీములు తొలి రోజు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, కోశాధికారి మక్కెన నరసింహారావు, సీనియర్ షటిల్ క్రీడాకారుడు గడగొట్టు రజని పాల్గొన్నారు.

### వరవకట్టలో కార్డన్ సెర్చ్

నర్సరావుపేట లీగల్, జనవరి 4: ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం అర్ధరాత్రి మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరవకట్టలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి వరవకట్టలో ప్రతి వీధిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలో సరైన అనుమతి పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మొదటి పట్టణ సీఐడి చరణ్ మాట్లాడుతూ వాహనదారులు సరైన అనుమతి పత్రాలు తీసుకువచ్చి వారి వాహనాలను తీసుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఎవరూ అపరిచితులకు, సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం ఇవ్వకూడదని తెలిపారు.

### ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బొల్లాపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో నేడు ఆరోగ్యం బీమా, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ సీతారామయ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ఉన్న పేదలకు ఆరోగ్య ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, జీవన జ్యోతి వంటి పథకాల గురించి, వాటి ప్రాముఖ్యం గురించి వివరించారు. ప్రతి ఒక్కరు పొదుపు చేయటం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సంస్థ ప్రతినిధులు ఎన్ సతీష్, యోసోబు తదితరులు పాల్గొన్నారు.

### యాచకులకు రగ్గుల పంపిణీ

యడ్లపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచకులకు, మతి స్థితిమితం లేని అనాథ వృద్ధులకు శుక్రవారం రాత్రి రగ్గులు పంపిణీ చేశారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సువర్ణకుమారి మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ రగ్గులు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు బాలోత్సవంలో - ఐగ్రో పాఠశాలకు 21 బహుమతులు

నరసరావుపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఎన్‌సీఅండ్‌కేఆర్ ఇనిస్టిట్యూషన్స్ ప్రాంగణంలో 2024 డిసెంబరు 28, 29 తేదీల్లో నిర్వహించబడిన పల్నాడు బాలోత్సవంలో వివిధ సాంస్కృతిక పోటీల్లో ఐగ్రో అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు పాటల పోటీలు, స్పెల్ బీ, ఫోక్ డాన్స్, క్లాసికల్ డాన్స్, ఫ్యాన్సీ డ్రెస్, మెమొరీ కాంటెస్ట్, స్టోరీ టెల్లింగ్, మ్యాప్ పాయింటింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, బుర్రకథ, క్విజ్ ఆయా సాంస్కృతిక పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ అన్ని కలిపి 21 బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల చైర్మన్ పల్లబోతుల వెంకట్ మాట్లాడుతూ తమ పాఠశాలలో కేవలం చదువుకే కాక వివిధ రంగాల్లో పిల్లలు రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నామని అన్నారు. గెలిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. పాఠశాల వైస్ చైర్మన్ పల్లబోతుల మురళిబాబు అమెరికా నుంచి వర్చువల్ ద్వారా మాట్లాడుతూ ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసిన బాలోత్సవం కమిటీ వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దివి శేషశాయి, వైస్ ప్రిన్సిపాల్ ఎండ్లూరి చంద్రబాబు, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం డెవలప్మెంట్ సొసైటీ అడ్వైజర్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మాజీ ఇన్‌చార్జి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆసక్తితో చదివి మంచి ఫలితాలు సాధించాలి

● గంగినేని ఫౌండేషన్ చైర్మన్ రాఘవ



పొట్లూరులో స్టడీమెటీరియల్ అందజేస్తున్న రాఘవ

మతుకుమల్లి(శావల్యాపురం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరై ఆసక్తితో చదివినపుడే మంచి ఫలితాలు సాధించగలుగుతారని గంగినేని ఫౌండేషన్ చైర్మన్ గంగినేని రాఘవ అన్నారు. గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మతుకుమల్లి జడ్పీ పాఠశాల్లోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీమెటీరియల్స్‌ను శనివారం ఉచితంగా అందజేశారు. మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు గంగినేని ఫౌండేషన్ ద్వారా రాఘవ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎం కృష్ణతులసి, నాయకులు ముంద్రు వెంకట్రావు, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పొట్లూరు జడ్పీపాఠశాల్లో పదోతరగతి చదువుతున్న 48మంది విద్యార్థులకు చైర్మన్ రాఘవ చేతులమీదుగా యూటీఎఫ్ స్టడీమెటీరియల్స్‌ను అందజేశారు. చైర్మన్ రాఘవ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులకు పోషకాహారం నిమిత్తం రూ.5వేల నగదు, పరీక్షా సామాగ్రిని అందజేస్తామని ప్రకటించారు. పదవ తరగతి విద్యార్థుల జీవితానికి తొలిమెట్టని, విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, పేద విద్యార్థులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల కంభంపాడు డీసీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా రాఘవని పాఠశాల హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, ఉపాధ్యాయులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వారితో తేజ అకాడమీ దుర్గారావు పాల్గొన్నారు.

## దేవదాయ భూముల వివరాలు తెలపాలి

అధికారులను నిలదీసిన గ్రామస్థులు

ఈపూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుమెళ్ళ గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు తహసీల్దారు ఏ నళిని హాజరై భూసమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో దేవదాయ భూములు ఆక్రమించుకొని కొందరు అమ్ముకున్నారని వాటిని గుర్తించాలని గ్రామస్థులు కోరారు. దేవుడి భూములు అన్యాక్రాంతం కావడంతో దూప దీప నైవేద్యం లేకుండా పోయిందన్నారు. ఏదో చుట్టపు చూపుగా వచ్చి పోవడం తప్ప దేవదాయశాఖ వాళ్ళు ఆలయ నిర్వహణ గురించి పట్టించుకోవడంలేదన్నారు. వందల సంవత్సరాల నాటి భవన్నారాయణ స్వామి ఆలయానికి అప్పటి రాజులు వందల ఎకరాలు దానం చేశారన్నారు. ప్రస్తుతం ఆ భూములు ఎక్కడ ఉన్నాయో? ఎవరి ఆధీనంలో ఉన్నాయో? అధికారులు గుర్తించి సమస్యను పరిష్కరించాలన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నప్పటికి వాటిని గుర్తించి ఆన్ లైన్‌లో ఆక్రమించుకున్న వారి పేర్లు తొలగిస్తారన్నారు. సదస్సులో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు, గోపువారిపాలెం సర్పంచ్, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎక్సెల్లార్ ఎడ్యు టెక్ ప్రవేట్ లిమిటెడ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కంపెనీ విధి విధానాలు హెచ్‌ఆర్ ఆర్ అవినాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మొత్తం 90 మంది విద్యార్థులు హాజరుకాగా ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ, ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు తదితరులు అభినందించారు.

### ఎంఏఎంలో గ్రూప్ కళాశాలలో

నరసరావుపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం గ్రూప్ కళాశాలలో ప్రముఖ డేటా పాయింట్ ఇన్ఫో సొల్యూషన్స్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఏడుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులు, నలుగురు ఎంఏఎం పీజీ కాలేజీ విద్యార్థులున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.రవిశంకర్, అధ్యాపకులు నవీన్, రాధికా, సితార, విద్యార్థులు అభినందించారు.

## జేఎన్‌టీయూ కళాశాలలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ వీఎల్‌ఎస్‌ఏ'




విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న కళాశాల అధ్యాపకుడు

నరసరావుపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఐఈ టీఈ స్టూడెంట్స్ ఫోరం భాగ్యసామ్యంతో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ వీఎల్‌ఎస్‌ఏ' మీద శనివారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బోధకులుగా సినాప్సిస్ నుంచి ఫిజికల్ డిజైన్ సీనియర్ స్టాఫ్ ఇంజనీర్ ఎం శ్రీధర్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొ సీహెచ్. శ్రీనివాసరావు, కన్వీనర్ గంగాధర్, ఐఎస్‌ఎఫ్. కో-ఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

### పీడబ్ల్యూడి వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నరసరావుపేట రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పీడబ్ల్యూడి వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూటీ ఆధ్వర్యంలో శనివారం నరసరావుపేట ఎస్‌ఎస్పీ ఎస్సీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, యూనియన్ ప్రధాన కార్యదర్శి, సీపీఐ ఏరియా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.